# విద్యార్థులు - దివ్యసంస్కృతి

**పూవులెన్నొ తెచ్చి పూజలు చేసిన**
**మెచ్చుకొనడు తాను పుచ్చుకొనడు**
**హృదయకమల మివ్వ సదయుడై గ్రహియించు**
**సత్యసాయి ప్రేమశాంతిదాయి**

విద్యార్థులారా! అధ్యాపకులారా!

ఆధ్యాత్మిక సంపత్తికి పుట్టినిల్లని పేరుగాంచిన మన భారతదేశమున ధర్మము నానాటికీ క్షీణించి, అధర్మము అభివృద్ధిగాంచి స్వేచ్ఛగా ప్రళయతాండవము సలుపుచున్న సమయమునందు దీనిని అరికట్టి శాంతి భద్రతలను దేశమునకు అందించుటకు విద్యార్థులే తగిన సమర్థులు. విద్యార్థులారా! దేశసుస్థితి విద్యార్థులపైననే ఆధారపడియున్నది. అట్టి విద్యార్థుల స్థితిగతులను ఉత్తమ మార్గమున మరల్చినప్పుడే దేశము శాంతి, భద్రతలను అందుకోగలదు. విద్యార్థియొక్క నడతను, విద్యార్థులయొక్క మానసిక శక్తిని, పవిత్రమైన మార్గమునందు ప్రవేశపెట్టవలెను. దీనికి దేహపుష్టి ప్రధానము. దీనికి ఆటలు, పాటలు, వ్యాయామము సరియైన మార్గము. దీనియందు క్రమశిక్షణను వుల్లంఘించక, పవిత్రమైన మార్గములో, పవిత్రమైన భావముతో విజయాన్ని సాధించటానికి ముందుకు రావాలి. యీ ప్రాకృతమైనటువంటి దేశమునందు, జీవితమునందు యేది ప్రధానము, యేది ఆధారము అనేటువంటి సత్యాన్ని మనము విచారించాలి. అదియే మన జీవితముయొక్క ఆదర్శము. మనిషి మరణించినప్పటికిని ఆదర్శము మరణించునది కాదు. ఇది నిరంతరము కూడను సజీవమై రాణించేటువంటిది. ఇది శాశ్వతమైనది. కనుక యిట్టి శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన, అనంతమైన ఆదర్శమును దేశమునకు అందించుటకు మనము దీక్షపూనాలి.

srisathyasaivachanamrutam

## విద్యార్థి జీవితము వృక్షమునకు వేరువంటిది

నేటి విద్యార్థులు తమ సంస్కృతిని తాము యే మాత్రముకూడ యెరుగరు. ఇలాంటి సంస్కృతిని తెలుసుకొనుటకు అధ్యాపకులే దీనికి సహాయకారులు. విద్యార్థులయొక్క జీవితము చక్కని సౌందర్యవంతమైన పూలతీగవంటిది. ఇది సక్రమమైన మార్గమున అల్లుకున్నప్పుడే శోభాయమానముగ ప్రకాశిస్తుంది. విద్యార్థి జీవితము వృక్షమునకు వేరు వంటిది. కనుకనే దీనిని ఫలవంతమైనటువంటిదిగ, పవిత్రమైనటువంటిదిగ సరిదిద్దుకోవాలి.

ఒకానొక సమయములో ఒక మహారాజు ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశాడు. ఇది చాలా అద్భుతమైనటువంటిది, ఆకర్షణీయమైనటువంటిది. ఇందులో వచ్చిన వారందరు ఎవరికి నచ్చిన వస్తువులు వారు తీసుకొనివెళ్ళవచ్చు. ఈ నియమము ననుసరించి దీనిని సందర్శించినటువంటి ప్రతివ్యక్తికూడను ఆ ఎగ్జిబిషన్ చూచి అందులోతమకు యిష్టమైనటువంటి వస్తువులన్నీకూడను తాము తీసుకొని వెళ్ళేవారు. ఇందులో ఒక సుందరమైన వనిత ప్రవేశించింది. ప్రవేశించి అన్నియు చూచి వట్టిచేతులతో తాను వెనుకకు వెళ్ళుతుంటాది. ఇది రాజు గమనించాడు. "ఏమ్మా! ఈ ఎగ్జిబిషన్ నీకు నచ్చలేదా? నీకు నచ్చిన వస్తువులు ఈ ఎగ్జిబిషన్‌లో లేవా?" అని ప్రశ్నించాడు. అందుకు ఆ స్త్రీ "మహారాజా! నీ ఎగ్జిబిషన్ చాలా సుందరముగా వున్నది. నాకు అవసరమైన వస్తువులుకూడ ఇందులో లేకపోలేదు. కానీ, నేను ఏదైనా ఒక వస్తువుకు ఆకర్షితురాలై, దానిని యిష్టపడితినా నా కోరిక దినదినమునకు పెరిగిపోతుంటాది. కనుక యీ యిష్టాన్ని అరికట్టుకొనే నిమిత్తమై నేను ఈ వస్తువులను తీసుకొనిపోవటంలేదు. నా ఆశలను అరికట్టుకొనే నిమిత్తమై నేను యీవిధమైనటువంటి వ్రతమును పూనినాను" అనింది. "అయితే, నీకు యిష్టమైనటువంటిది యేమైనా ఇక్కడ వున్నాదా?" అని తిరిగి ప్రశ్నించాడు, రాజు. "నేను ఆశించి ప్రయోజనమేమిటి? అది నాకు లభించేటువంటి స్థితిలో వున్నదా అని నేను విచారిస్తున్నాను", అనింది యీ స్త్రీ. అప్పుడు రాజు "నీ అభీష్టము యేమిటో చెప్పు తప్పక నేను ఆ వస్తువునందిస్తాను" అన్నాడు. ఈ వనిత సంతోషించింది. "రాజా! యిది సత్యమైన



srisathyasaivachanamrutam

వాక్కేనా? లేక అసత్యమైనటువంటిదా?" అని ప్రశ్నించింది. అందుకు రాజు "లేదు, నా మాట ఒక్కటే! నేను తప్పక నెరవేర్చగలను" అన్నాడు. అప్పుడామె "రాజా! నాకు నీవే కావాలి", అనింది. "సరే! నేటినుండి నీవు నా రాణిగా వుండ"మన్నాడు, ఆ రాజుగారు. అప్పటినుండి ఆమెకు ఆ ఎగ్జిబిషన్ అంతా తనదే! ఆ ఎగ్జిబిషన్‌కు తానే యజమానురాలైంది. ఇంతకాలము ఆ ఎగ్జిబిషన్ చూసి యేదో కొన్ని వస్తువులు ఆశించాలని వచ్చింది. కానీ రాజునే ఆశించటముచేత యీ ఎగ్జిబిషన్ తనయొక్క హస్తగతమైపోయింది. ఈ ప్రపంచమంతయుకూడను భగవంతుడు నిర్మించిన ఒక ఎగ్జిబిషన్. రాజాధిరాజ, ఆ ఎగ్జిబిషన్‌యొక్క సర్వాధికారి భగవంతుడే! ఇందులో ప్రవేశించిన ప్రతిజీవికూడను తనకు అవసరమైనటువంటి వస్తువులను ఆకర్షించుకొని అందుకొంటూ వున్నాయి. కానీ, ఒకప్పుడు ముక్తికాంత యిందులో ప్రవేశించింది. ఆమెను ఇందలి వస్తువులు ఎంతగా ఆకర్షించినప్పటికినీ, వాటిని అందుకొనుటకు ఆమె ప్రయత్నించలేదు. తాను ఆశించినది ఒక్క భగవంతుడినే! ఎవరిని ఆశిస్తే సర్వము మన హస్తగతమౌతుందో, యెవరిని పొందినప్పుడు సర్వ ప్రపంచముకూడను మనయొక్క స్వాధీనమునందుంటుందో వారిని పొందాలి, వారిని ఆశించాలి.

**ఆశకు దాసుడైన జగమంతటికి దాసుడే?**

వృక్షముయొక్క వేళ్ళకు నీరుపోసినప్పుడే ఆ వృక్షమునందున్నటువంటి ఫల పుష్పములను అందుకోవటానికి మనము అర్హులమవుతాము. ఈ ప్రపంచములో గల సమస్త పదార్థములు అస్థిరములు, అశాశ్వతములు. ఏదో కొంతకాలము తాత్కాలిక శాంతి, సంతోషములు అందించగలవే గానీ శాశ్వత సుఖశాంతులను మనము పొందలేము. ఆశకు దాసుడైన జగమంతటికినీ తాను దాసుడే కదా! కనుక, అట్లు కాకుండా దైవానికి దాసుడు కావాలి. అంతవరకు మనము శాంతిని, సహనమును, క్షమను పెంచుకోవటానికి ప్రయత్నించాలి. ప్రతి ఒక్క కష్టమును మనము ఆనందముతో స్వీకరించాలి. ప్రతి బాధను, ప్రతి నిందను, ప్రతి నిష్ఠూరమునుకూడను మనము సహించుకొని భరించాలి. మనకు ఎవరు ఏ అపకారము చేసినను దానిని వుపకారముగనే భావించాలి. ఈ వయస్సునందు

sri sathyasai vachanamrutam

అట్టి సమచిత్తమును అభివృద్ధి పొందించుకున్నప్పుడే మనము దైవముయొక్క అనుగ్రహానికి పాత్రులము కాగలము.

**శాంత, సహనభావములతో అన్ని విషయాలలోను సమర్థించుకునే శక్తి చాలా అవసరము**

మీకు తెలుసు, పాశ్చాత్యదేశమునందు జన్మించినట్టి మహాతత్త్వజ్ఞాని సోక్రటీసు. ఈ సోక్రటీసు నిరంతరము యోచిస్తూ, యోచిస్తూ, యోచిస్తూ యీ విధమైనటువంటి విచారణ సలుపుతూ వుండేటువంటివాడు. ఒకనాడు 'నేనెవరు?' 'నేనెవరు?' అనేటువంటి విషయమును గురించి విచారణచేస్తూ అందులో పూర్తిగా నిమగ్నుడైనాడు. ఆ రోజు సాయంకాలము తాను ఒక రోడ్డులో వాకింగ్‌కు వెడుతున్నాడు. అదే రోడ్డులోపల ఒక రిటైర్డు ఆఫీసరు తానుకూడ ఒక వాకింగ్ స్టిక్ పట్టుకొని వాకింగ్ చేస్తూ వస్తున్నాడు. ఆయన సంసారాన్ని గురించి విచారిస్తూ వాక్ చేస్తున్నాడు. ఈయన తన తత్త్వాన్ని తాను విచారిస్తూ వాక్ చేస్తున్నాడు. వీరిద్దరూ ఎవరి ఆలోచనలలో వారు మునిగి ఎదురుగా వచ్చే వారిని గమనించక ఒకరినొకరు ఢీకొట్టారు. తక్షణమే యీ రిటైర్డు ఆఫీసరు 'Who are you' అనగా 'మీరెవరు?' అన్నాడు కోపంతో. అందుకు సోక్రటీసు ఆ వ్యక్తికి నమస్కారము చేస్తూ 'అదే నాకు కావాలి, దయచేసి నేనెవరో చెప్పండి', అన్నాడు. ఆ ఆఫీసరుకు యిదేమి అర్థము కాలేదు. తనంతటతాను మౌనంగా వెళ్ళిపోయాడు.

సోక్రటీసు ఇంటికి వచ్చాడు, ఈజీచైర్‌లో కూర్చున్నాడు. 'Who am I' అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎనిమిది గంటలు అయింది. భార్య భోజనము వడ్డించింది. 'ఏమండి, భోజనం తయారైంది, రండి రండి', అని పిలిచింది పాపం. అది వినిపించుకోలేదు, సోక్రటీస్. ఇతను యెక్కడో యోచనచేస్తూ పరధ్యానములో వున్నాడు. ఒక గంటసేపు కాచుకుంది. ఆమెకు కోపం వచ్చింది. ఒక బిందెనీళ్ళను తీసుకొనిపోయి సోక్రటీసు తలపైన పోసింది. వెంటనే యీ సోక్రటీసు తెలివితెచ్చుకుని 'నిత్యము వురుములు మాత్రమే వురిమేది. యీనాడు కుంభవర్షము కురిసింది', అని వ్యాఖ్యానించాడు. శాంతాన్ని పొందాడు. నిజముగా యీనాటి స్త్రీలే వచ్చి బిందెడు నీళ్ళు తలపై పోస్తే ఆమెను కొప్పుపట్టి యీడ్చి కొట్టేస్తారు. కాని, ఆయన ఆవిధముగా కోపానికి అవకాశము యివ్వలేదు. దినము

sri sathyasai vachanamrutam

తన భార్యయొక్క తత్త్వము తనకు తెలుసు కనుక, 'వురుములు వురుముతూ వచ్చేది; కానీ, యీనాడు వర్షముగానే కురిసింది', అని శాంతముగా సహనభావముతో సరిదిద్దుకున్నాడు. ఈ సమర్థించుకునే తత్త్వము మనకు చాలా అవసరము.

ఒక చిన్న ఉదాహరణము: మీ క్లాసులో పిల్లలే వుంటూ వుంటారు. ఒక స్టూడెంట్ వచ్చి యేదో ఒక పుస్తకము చదువుకోవటానికి యివ్వమంటాడు. మీరు యిస్తారు. తరువాత ఇంకేదో కావాలంటాడు. ఈవిధముగా రెండు, మూడు పర్యాయములు అతనికి మీ వస్తువులు యిస్తారు. ఎన్నెన్నియో హెల్ప్ చేస్తారు. అదే వ్యక్తిని మీకు ఏదైనా కావాలని అడిగినప్పుడు అతను యివ్వకపోతే తక్షణమే మీకు కోపము వస్తుంది. 'అరే! నేనంతా అతనికి బుక్స్ ఇచ్చాను, పెన్ ఇచ్చాను, యెంతో హెల్ప్ చేశాను. నాకు ఈనాడు ఒక చిన్న హెల్ప్ చేయలేదా?' అని ఈ చిన్న విషయములోపలనే ద్వేషాన్ని పెట్టుకొని యింక ఒకరితో ఒకరు విరోధభావము పెంచుకుంటారు. యిలాంటి సమయములోపలే పిల్లలు సహనాన్ని పాటించాలి. 'నేను యిచ్చాను, తాను యివ్వలేదు. పాపం అతనికి యిష్టంలేకపోయింది కావచ్చు' అని అనుకొని సమర్థించుకోవటానికి తగినటువంటి వయస్సు యిది. యీ వయస్సులో చక్కగా సమర్థించుకొనేటువంటి శక్తిని పెంచుకోవాలి.

తుకారాం విషయము మీకు బాగా తెలుసు. తుకారాంకు ఒకే ఒక ఎకరా భూమి వుండేది, పాపం! అతను బీదవాడు, పరమ భక్తుడు. నిరంతరము భగవంతుని చింతిస్తూ తన కాలాన్ని, కర్మలను గడుపుకుంటూవుండేవాడు. ఒకనాడు చెరకుతోటను ఆభూమిలో వేశాడు. చెరకు ఫలానికి వచ్చింది. ఆనాడు బండి తీసుకొనిపోయి ఆ చెరకునంతా నరికి బండిలోవేసుకొని యింటికి వస్తున్నాడు. అతని తత్త్వము గుర్తించి చిన్నచిన్న పిల్లలందరూ 'తాతా! నాకొక చెరుకు, తాతా! నాకొక చెరుకు' అని అందరూ అడుగుతూ వచ్చారు. అతని హృదయము ప్రేమమయమైనది. చాలా మెత్తని మనస్సు అతనిది. అందరియందు దైవమే వున్నాడనే స్వభావము. 'దైవము యీ రూపములో వచ్చి అడిగినప్పుడు ఇవ్వక పోవటమా! ఛీ! ఛీ!' అనుకొన్నాడు. ఆవిధంగా అడిగిన పిల్లలందరికి ఒక్కొక్క చెరుకు గడ పంచుతూ వచ్చాడు. ఇంటికి వచ్చేసరికి ఒకే ఒక చెరుకు గడ మిగిలింది పాపం! కానీ, యీ

srisathyasaivachanamrutam

తుకారాంయొక్క భార్య మహాగయ్యాళి. చూచింది, యీ దృశ్యమంతా. 'ఏమిటండీ! యింటిలో భార్యా, పిల్లలు వున్నారని మీకు జ్ఞాపకం వుందా? లేదా? వున్నదంతా బయటివారికి దానధర్మములు చేస్తూవుంటే మేము యేవిధంగా బ్రతకాలి?' అని చాలా చివాట్లు పెట్టింది. ఆయన ఫక్కున నవ్వుతూ కూర్చున్నాడు పాపం. ఈ నవ్వునుచూచింది. ఆమెకు మరింత కోపము అధికమైంది. ఆ ఒక్క చెరుకు తీసుకొని అతని నెత్తిపై కొట్టింది. ఆ చెరుకు గడ విరిగి అందులో ఒక్క తుండు ఆమె చేతిలో మిగిలింది. మిగిలిన తుండు క్రిందపడి పోయింది. అప్పుడు తుకారాం 'అమ్మా! ఎంత ఉపకారం చేస్తివి నీవు నాకు', అన్నాడు. కారణమేమనగా ఒకే చెరుకు మిగిలింది. 'దీనిని పిల్లలకు, భార్యకు, నాకు యేవిధముగా పంచుకోవటము అనుకున్నాను. నీ భాగము నీవు చేతిలోనికి తీసుకున్నావు. మిగిలిన యీ భాగము నేను, నా బిడ్డలు తీసుకుంటాములే! చాలా వుపకారము చేశావు' అన్నాడు. కనుక, యింటిలో యీ విధమైనటువంటి గయ్యాళిగంప వుండినప్పటికిని, ఆమెయందుకూడ సవరించుకొనేటువంటి సానుభూతిని, సమర్థతనుకూడా సంపాదించుకున్నాడు, తుకారాం. ఇలాంటి సహనభావము వుండటము చేతనే ఆనాటి వ్యక్తులందరు మహనీయులుగా మారుతూవచ్చారు.

**మానవత్వము దివ్యత్వముగా మారటానికి నామము అత్యవసరము**

భగవంతునియొక్క నామము యెలాంటి వారినైనా వున్నతస్థాయికి తీసుకొనిపోతుంది. నిరంతరము రామనామము చింతించినటువంటి కోతి, హనుమంతుడు. కానీ, అలాంటి కోతినికూడ పరమభక్తునిగా తీర్చిదిద్దుకొని భగవంతునియొక్క స్థాయికి తీసికొనిపోయాడు. కోతియైన హనుమంతుడు దైవత్వస్థానాన్ని పొందాడు. దీనికి కారణము, నిరంతర రామనామమే! ఇంక పశువు. నందిగా వుండినటువంటి పశువును ఈశ్వరుడు వాహనముగా చేసుకొన్నాడు. ఫలితంగా పశువైన నంది నందీశ్వరునిగా మారిపోయింది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాదులను మించినటువంటి శక్తి కలిగినవాడు, హిరణ్యకశిపుడు. ఇతనికి పుట్టినటువంటి కుమారుడుకూడను రాక్షసుడే! కాని ఈ దానవుడైనటువంటి ప్రహ్లాదుడుకూడ దైవనామముస్మరించుటచేతనే దైవ రూపాన్ని పొందగలిగాడు. దానవుడు



sri sathyasai vachanamrutam

దైవరూపాన్ని పొందటానికి, వానరుడు దైవత్వాన్ని చెందటానికి, పశువు పశుపతిస్థానాన్ని పొందటానికి కారణము, నామమే. కనుక మానవత్వమనేటువంటిది దివ్యత్వముగా మారటానికి నామమే అత్యవసరము.

## ఏ పని చేస్తున్నప్పటికి దైవ భావముతో చేయాలి

మనము యేపనిచేస్తున్నప్పటికిని దైవభావముతో పనిలో ప్రవేశించాలి. కేవలము లౌకికమైనటువంటి, భౌతికమైనటువంటి భావములకు మన జీవితమును అంకితముగావించుకోరాదు. ఈ మనస్సనేటువంటిది మహా గయ్యాళి. కనుకనే అర్జునుడుకూడను దీనిని నియంత్రణ చేయడానికి అనేక విధములుగా శ్రీ కృష్ణుని ప్రార్థించి ప్రశ్నిస్తూవచ్చాడు, దీనియొక్క స్వభావము యేమిటని. 'చంచలం హి మనః కృష్ణ ప్రమాదీ బలవద్దృఢం'. బలమైనటువంటి, దృఢమైనటువంటి, చంచలమైనటువంటి ఈ మనస్సు నరికట్టుకునేటువంటి మార్గమును నాకు బోధించమని ప్రార్థించాడు. యువకులైనటువంటి మీ మనసు మరింత పిచ్చికోతివంటిది. ఇలాంటి కోతిని మనము అరికట్టాలనుకుంటే ప్రయత్నపూర్వకముగా మనలోవున్నటువంటి దివ్యశక్తిని మనము ఆవిర్భవింపచేసుకోవాలి. దీనిని అరికట్టుకోవటానికి సామాన్యమైన మార్గములో మనము ప్రయత్నిస్తే, విఫలమైపోతాము. దీనినే నిరంతరము ఆధారముచేసుకుంటే మరింత అధోగతికి దిగజారిపోతాము. దానిని మరచిపెట్టుకోవటానికి కొంత ప్రయత్నించాలి. ఈ మనస్సు యేదో పిచ్చిమార్గములో ప్రయాణము చేస్తూవుంటే దానిని పవిత్రమైన మార్గములోనికి ప్రయత్నపూర్వకముగా మరల్చటానికి పూనుకోవాలి.

మన ఆంధ్రదేశములో ఒక గొప్ప పండితుడు వుండేవాడు. ఆయన ఒక మహా అద్భుతమైన గ్రంథాన్ని వ్రాశాడు. ఆ గ్రంథానికి అవార్డుకూడ వచ్చింది. ఈ విషయము వార్తాపత్రికలలోకూడా ప్రకటించారు. యీ పండితునియొక్క స్నేహితుడు ఆ వార్తను విని చాలా ఆనందించి, ఒకనాటి సాయంకాలము అతని ఇంటికి కంగ్రాచులేషన్స్ చెప్పడానికి వచ్చాడు. 'హలో! హలో! మై బ్రదర్!' మెనీ థ్యాంక్స్, మెనీ థ్యాంక్స్', అన్నాడు. కారణము,

sri sathyasai vahini amrutam

'నీవు బ్రహ్మాండమైన గ్రంథాన్ని రాశావు. ఈ గ్రంథము చాలా పెద్దది, దీనిని వ్రాయడానికి నీకు ఎవరైనా సహాయపడినారా?' అని అడిగాడు. అతనుకూడా మిత్రుని చాలా ఆప్యాయముగా పిలిచి సోఫాలో కూర్చోపెట్టుకొని మాట్లాడుతూ, భార్యతో తన మిత్రునికి కాఫీ తీసుకొని రమ్మని చెప్పాడు. ఆమె ఒక తట్టలో ఇద్దరికి కాఫీగ్లాసులు పెట్టుకొని తెచ్చింది. ఆ మిత్రుడు 'నీవొక్కడివే రాశావా? నీకు ఇంకెవరైనా సహాయము చేశారా?' అని అడిగాడు, మరలా. అప్పుడు పండితుడు చెబుతున్నాడు: 'అయ్యో! నేనొక్కడినే యింత గ్రంథాన్ని రాయగలిగానా, లేదు. నాకు నా ధర్మపత్ని చాలా సహాయము చేసింది' అన్నాడు. ఆమె ఈ మాట వినింది. 'ఏమిటి, పండితులంతా యెప్పుడుకూడను యీవిధంగా అబద్ధాలు చెప్పటం ఒక అభ్యాసమై వుంటున్నది. నేను ఏ సహాయము అతనికి చేయలేదు. ఈపుస్తకము రాసే సమయములో నేను ఇంటిలోకూడ లేను. నేను మా పుట్టింటికి వెళ్ళాను. కానీ యీయన నాపేరు చెబుతున్నాడే! యేమిటి', అని ఆశ్చర్యపోయింది. అప్పుడే ఆ మిత్రుని ముందే ఆవిషయము అడుగుదామని అనుకుంది. కానీ, కుటుంబగౌరవము ఆలోచించి, ఈ సమయములో అడగకూడదు అని వూరకున్నది. ఆపండితుని మిత్రుడు వెళ్లాడు. సాయంకాలమైంది. తిరిగి యీయన యేదో రాసుకుంటూ కూర్చున్నాడు. ఆ సమయములో ఈమె అతని దగ్గరకు వచ్చి, 'ఏమిటండీ యీ పండితులంతా రాయటము అబద్ధాలే! చెప్పటము అంతా అబద్ధాలే! మీరు పండితులని పెద్దపేరు పొందారు దీనికి ఏమిటి అర్థము?' అని అడిగింది. అప్పుడా పండితుడు "ఏమిటి నేను రాసింది అబద్ధము? నేను చెప్పిన అబద్దము యేమిటి? ఎప్పటికి నేను చెప్పను. అసత్యము 'పండితః సమదర్శనః' నాలో యెప్పుడుకూడను సమత్వమే వుంటుంటాది. కనుకనే నేను అసత్యము ఆడను" అన్నాడు. అప్పుడు ఆమె చెప్పింది, "ఇప్పుడు కాదండి, కొన్ని గంటలముందు నా భార్య నాకు యెంతో సహాయము చేసింది యీ గ్రంథము రాసిన విషయములో అని అబద్ధమాడారు కదా" అనింది. 'నేను ఈ విషయములో యేమాత్రము అబద్ధమాడలేదు' అన్నాడు భర్త. 'మీరు పుస్తకము రాసే సమయములో నేను ప్రసవానికి వెళ్ళి మూడునెలలు నా పుట్టింటిలో వున్నాను. ఆ సమయంలో నేను మీకెట్లా సహాయపడినాను?' అంది. 'అదే నీవు చేసిన సహాయము నాకు' అన్నాడు. 'నీవే యింటిలోవుంటుంటే నీకు కావలసిన



sri sathyasai vachanamrutam

సప్లయిలు చేయటానికి నాకు టైమంతా సరిపోతుంది. అప్పుడు నీవు యింటిలో లేకపోవటముచేత యేదో హోటలులో ఇంత కడుపుకు వేసుకొని ప్రశాంతంగా, హాయిగా రాయగలిగాను. ఇదే నీవు చేసిన సహాయము' అన్నాడు.

**మనస్సును విశ్రాంతిగా ఉంచడానికి పవిత్రమైన కర్మలలో ప్రవేశపెట్టాలి**

అదేవిధముగ పురుషునికి, మైండ్ ఒక వైఫ్. ఈ మైండ్ నిరంతరముకూడ పురుషునిపై వత్తిడి పెడుతూవుంటుంది. చాలా హింసిస్తూ వుంటుంది. ఈ మనసు కొంత దూరమైపోయినప్పుడు ఇతనికి ప్రశాంతత యేర్పడుతుంది. ప్రశాంతమైనటువంటి సమయములో ఎటువంటి పవిత్రమైన విషయమును గురించైనా తాను యోచించటానికి వీలవుతుంది. అందువలన యీ చంచలమైన మనస్సును కొంతవరకు దూరము పెట్టటానికి తగిన ప్రయత్నము చేసినప్పుడే మనము జీవితాన్ని పవిత్రమైన ఆదర్శవంతమైన జీవితముగా తీర్చిదిద్దుకోవటానికి వీలవుతుంది. మనసును విశ్రాంతిగా ఉంచడానికి మనము దానిని కొన్ని పవిత్రమైన కర్మలలో ప్రవేశపెట్టాలి. అందుకోసమే ఈ ఆటలు. ఈ ఆటలు అడుతుంటే మనసు ఇతర విషయాలలో ప్రవేశించటానికి యే మాత్రము అవకాశము వుండదు. ఈ మైండ్ అంతాకూడ యీ ఆటలపైననే యేకాగ్రత పొందుతుంది. అనవసరమైన విషయములలో ఇది ప్రవేశించదు.

మీరు చూచేవుంటారు, కోతిని ఆడించేటువంటివాడు ఒక కోతిని పట్టుకువస్తాడు. దాని మెడకు ఒక తాడు కట్టి దానిని తీసుకొని ఇంటింటికి వెళ్ళి భిక్షము అడుగుతూవుంటాడు. అలా సేకరించిన భిక్షనంతా యిది పెరికి పెరికి తింటూ కూర్చుంటుంది. కనుక దీనికి యేదైనా పనిపెట్టడానికి ప్రయత్నం చేస్తాడు. ఒక కఱ్ఱను తీసి పట్టుకుని ఆ కఱ్ఱపైన ఈ కోతిని 'యెక్కు తిమ్మన్నా దిగు తిమ్మన్నా, యెక్కు తిమ్మన్నా దిగు తిమ్మన్నా' అని చెపుతూ దానికి యెక్కటం దిగటం యెక్కటం దిగటం అనే పని పెట్టేస్తాడు. ఈ పని యిది చేస్తూవుంటే తనపని తాను చూసుకొనిపోతుంటాడు. తనకేమీ శ్రమవుండదు. కేవలం ఆ కోతికొక పని పెట్టాలి. అదే అతను చేసేది. మన మైండ్ అనేటువంటిదికూడ ఒక మ్యాడ్ మంకీ. ఎల్లప్పుడు దీనికొక పని పెట్టాలి; లేక పోతే, అది మనకు పనిపెడుతుంది. అందువలననే



srisathyasaivachanamrutam

మనమొక కఠినమైనటువంటి చర్యలో పాల్గొన్నప్పుడు యీ మైండ్ మన జోలికే రాదు. అది పోయినట్లంతా మనము పోతిమా, దానితోపాటు మనముకూడా కోతులైపోతాము. కనుక ఆ మంకీ ఈ మంకీ రెండూ చేరాయంటే వూరికే వుండవు. యింక జగడాలు వేస్తాయి. అది వాటి స్వభావము.

కనుక, మనసును సరియైన మార్గములో వుంచాలంటే ఈ వయసులోనే మనము ప్రాక్టీస్ చేస్తూరావాలి. మన ప్రాక్టీసు ఏమిటంటే కొన్ని ఆటలాడుకోవటం, పాటలు పాడుకోవటం, మాటలను తగ్గించుకోవటం. యీవిధమైనటువంటి కంట్రోలును ప్రయత్నపూర్వకముగా మనము సాధించాలి. ఇంకా యేదైనా నీకు అవసరముంటుంటే పుస్తకాలు చదువుకో, గ్రంథములు పఠించు. విద్యార్థులారా! మీరు అధికముగా భాషించకూడదు. ఈ అధికభాషణవల్ల యేమైపోతుందంటే క్రమక్రమేణా అది ఒక వ్యసనముగా ముదిరిపోయి కలహముగా మారుతుంది. పిల్లలు నిరంతరము ఆనందముగా జీవించటానికి ప్రయత్నించాలి. ఏవైనా కొన్ని విచారాలు వచ్చినప్పటికినీ తక్షణం దానిని ప్రక్కకు నెట్టివేయాలి. ఎవరైనా మిమ్మల్ని యేదైనా కఠినమైనమాట అన్నారంటే దానిని మీరు పట్టించుకోకుండా మరచిపోవటానికి ప్రయత్నించాలి.

**సమత్వమే వివేకమునకు గుర్తు**

ఈవిధమైనటువంటి ప్రాక్టీసు యీ వయసునుండి చేసినప్పుడే మీరు ముందు ముందుకు ఎంతైనా పవిత్రమైనటువంటి ఆదర్శమును అందించగలరు. చదివే చదువులతోపాటు యీవిధమైన కొన్ని క్రమశిక్షణలనుకూడా మనము అలవరచుకోవాలి. సహనము సానుభూతి అనేటువంటి దివ్యమైన గుణములను పెంచుకోవాలి. సమత్వమే వివేకానికి ఒక గుర్తు. ఇంతేకాదు, బ్రహ్మచర్యము నిజమైనటువంటి నైతికానికి గీటురాయి. వినయమే విద్యకు సరియైనటువంటి గీటురాయి. మనయొక్క స్వార్థరాహిత్యమే వుత్తమ స్థాయికి ఒక గీటురాయి. విద్యార్థులు యీ నాల్గింటిని సరియైనటువంటి మార్గములో సాధించటానికి ప్రయత్నించాలి. సమత్వము, వినయము, స్వార్థరాహిత్యము, బ్రహ్మచర్యము యిందులో యే ఒక్కటి పోయినప్పటికినీ నీవు మానవత్వాన్ని కోల్పోతావు.

srisathyasaivachanamrutam

## దయ, ప్రేమల సన్నిహితసంబంధమే ధర్మము

నిరంతరము హృదయములోపల 'దయ' అనేటువంటి దానిని మనము అభివృద్ధిపరచుకోవాలి. 'దయగల హృదయమే దైవమందిరము' అన్నారు. హృదయము అనగా 'హృత్', 'దయ'. దయతో కూడినప్పుడే యిది హృదయమవుతుంది. లేకపోతే గట్టిరాయి అవుతుంది. దయనుంచి వచ్చినటువంటిదే హృదయము. కనుకనే భగవంతుడు 'హృదయనివాసి' అన్నారు. దయతో కూడినటువంటి హృదయము కనుక అక్కడే భగవంతుడు స్థిరనివాసము ఏర్పరుచుకుని వున్నాడు.

దయకు ఒక చిహ్నమే ప్రేమ. ఈ దయ, ప్రేమలయొక్క సన్నిహిత సంబంధబాంధవ్యమే ధర్మము. ధర్మమునకు మారుపేరు ప్రేమ. ఈ ప్రేమ, దయలయొక్క అనుభూతులే ధర్మము. మనము ఒక్క ప్రేమను పెంచుకొంటిమా దయాధర్మములు రెండు అందులోనే ప్రవేశిస్తాయి. కనుక విద్యార్థులైనటువంటి మీరు సాధ్యమైనంతవరకుకూడను పవిత్రమైన భావములతో, పవిత్రమైన చర్యలతో, పవిత్రమైన మార్గములందు ప్రవేశించి సార్థకమైనటువంటి జీవితమును గడపాలని నేను ఆశిస్తున్నాను.

## చిన్న పిల్లల హృదయాలు నిర్మలమైనవి

అల్పవస్తువులను ఆశించి, అల్పజీవితాన్ని గడపటానికి ప్రయత్నించేకంటే, అధికమైనటువంటిదానిని ఆశించి, వున్నతమైనటువంటి జీవితాన్ని గడపటానికి మనము కృషిచేయాలి. ధృవుడు మహాగొప్ప తపస్సు చేశాడు. అప్పుడు అతని వయస్సు ఆరు సంవత్సరములు. కానీ ఆ తపస్సు చేస్తూ చేస్తూ నిర్మలమైన, నిస్వార్థమైనటువంటి హృదయము, పవిత్రమైనటువంటి భావముతో తాను తపస్సు చేయటమువల్ల మహా విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. స్వచ్ఛమైన తెల్లని కాగితముపైన యెలాంటి గీతలు గీసినాగానీ అవి అందముగానే కనిపిస్తాయి. నల్లటిపేపరుపైన యెలాంటి గీతలు గీసినా ఆ నలుపులో నలుపు చేరిపోతాయి. మంచి అందమైనటువంటి, సుందరమైనటువంటి భగవంతుని చిత్రము వ్రాసినప్పటికీ అది మనకు కనిపించదు. చిన్నపిల్లల హృదయములు చాలా నిర్మలమైనవి. వారివి, నిస్వార్థమైనటువంటి హృదయాలు. అటువంటి హృదయముతో

sri sathyasai vachanamrutam

మీరు భగవంతుని యేవిధముగా పిలిచినప్పటికినీ ఆయన తక్షణం అక్కడ ప్రత్యక్షము కావటానికి అవకాశముంటుంది.

ఒక చిన్న ఉదాహరణ చూడండి. చంటి బిడ్డను తొట్టిలో పండుకోపెట్టి అమ్మ పై అంతస్థులోపల పనులు చేసుకుంటూ వుంటుంది. కెవ్వున ఆ బిడ్డ తొట్టెలోనుండి లేచి అరచేటప్పటికి అపరకను అక్కడ పారవైచి, చేతిలో వున్న వస్తువులను అక్కడ విడచిపెట్టి పరుగెత్తి వచ్చేస్తుంది. అది తల్లియొక్క ప్రేమ. ఒక్కతూరి ఆర్తుడై 'భగవంతుడా!' అని పిలుస్తే తాను యెలాంటి పరిస్థితిలోనున్నాగానీ ఠక్కున భగవంతుడు దిగివచ్చి రక్షిస్తాడు. ఈ బిడ్డ యేడ్చిన తక్షణమే తల్లి 'ఓహో! నాబిడ్డ యేతాళానికి సంబంధించి యేడుస్తోంది. ఏ రాగముతో యేడుస్తోంది', అని యోచించదు. అదే విధముగనే భగవంతుడు వీడు యెట్లా ప్రార్థిస్తున్నాడు అని యేమాత్రము విచారించడు. ఒకతూరి ఆర్తుడై ప్రార్థిస్తే తాను యే కారణాన్ని చూడకుండా దిగి వస్తాడు. అదేవిధంగా ధృవుడు ప్రార్థించేటప్పటికి విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. 'నాయనా నీకేమికావాలి?' అన్నాడు. "స్వామీ! నేనేదో అమాయకత్వములోపల, అజ్ఞానములో మునిగి, యేమేమోకోరి నిన్ను ప్రార్థించటానికి వచ్చాను. ఒక గాజు ముక్కను వెదుకుతూవచ్చాను. నాకు పెద్ద వజ్రమే దొరికింది. నీటిబిందువునుచూచి అమృతకలశాన్ని వదులుకుంటాడా ఎవడైనా? విలువైన రత్నాన్నిచూసి గాజుముక్కను చేతిలో పట్టుకుంటాడా యెవడైనా? ఇదిగో నా రెండు హస్తములతో నేను నీ పాదములే పట్టుకున్నాను. నీవు తప్ప నాకు అన్యము అక్కరలేద"న్నాడు, ధృవుడు. చూడండి, తాను ఆశించి వచ్చింది ఒకటి, కానీ అనుభవించింది మరొకటి.

యేదో ఒక కార్యాన్ని ఆశించి మీరు యిక్కడకు రావచ్చును. విద్యకోసము రావచ్చును. ఇంకే విధమైన డిగ్రీలు పొందుటకు రావచ్చును. కానీ దానిలోపలకూడను యీ పవిత్రమైనటువంటి సన్నివేశము మీకు ప్రాప్తించటము అదృష్టము. కానీ యింతట్లో మీ చదువులు మానివేసి వుండమని నేను చెప్తానా? ఎప్పటికీ నేను చెప్పను. విష్ణువుకూడా యేమి చెప్పాడు? "నీవేవో ఆశించే వచ్చావు. వచ్చిందానికి ఫలితం చిక్కింది. కానీ, నీ ప్రతిజ్ఞను మాత్రం నెరవేర్చుకుని రమ్మ"నమని తిరిగి యింటికి పంపించాడు.

srisathyasaivachanamrutam

కారణమేమిటి? 'మనస్యేకం వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనమ్'. మూడింటియొక్క యేకత్వము కావాలి. "నేను మహావిష్ణువును సందర్శించి, అతని వరాన్ని పొంది, తండ్రితొడపైన వచ్చి కూర్చుంటాను అని నీవు ప్రతిజ్ఞ చేశావు, మనసులో. అడవిలోకి వచ్చి దేహముతో కఠినమైన తపస్సును ఆచరించావు. కానీ మాటను వేరే కోరుతున్నావు. ఇక్కడ దేహము, మనస్సు ఒక్కటైంది, మాటవేరుగా మారిపోయింది. నీ body, mind యీరెండు ఒక్కటైంది. మెజారిటీ అక్కడే వుంది. మాట వేరైపోయింది. మెజారిటీకే ఓటన్నారు. నీవు తలచటము ఒకటి, చేయటము ఒకటి, అడగటం మరొకటి అడుగుతున్నావు. కనుక నీవు యిక్కడ వుండటానికి వీలులేదు. నీవు వెళ్ళి తల్లి తండ్రులను సంతోషపెట్టి తిరిగి తరువాత కావలసి వుంటే రమ్మ"నమని చెప్పాడు.

**మనసులోని తలంపు, నోటితే చెప్పిన మాట, చేతులతో చేసే పని ఒక్కటి కావాలి**

విద్యార్థులు మనసులో యేమి తలచుకుంటారో మాటలో అదే చెప్పాలి. అదే సత్యము. ఈ మాటలో చెప్పి మనసులో తలచుకున్నటువంటిదే చేతులతో చెయ్యాలి. అదే ధర్మము. యీ సత్యధర్మాల్ని మనము అనుసరించామంటే శాంతిప్రేమలు మనకు సులభముగా లభిస్తాయి. తలచుకున్నటువంటిదానిని యే భయము లేకుండా నిర్భయముగా మీరు చెప్పటానికి పూనుకోండి. దానిని సక్రమముగా చేయండి. ఇది నిజమైన సత్యము. టీచర్సుకో తల్లి తండ్రులకో భయపడి అసత్యము మటుకు ఆడనక్కరలేదు. ఏదో ఒకటి రెండు రోజులు కొంతవరకు మీకు బాధలు కలుగవచ్చును. సత్యమువల్ల క్రమక్రమేణా మీ జీవితము సత్యస్వరూపాన్ని ధరిస్తుంది.

అందువలననే హరిశ్చంద్రుడుకూడా చెప్పాడు. 'సత్యాన్ని యెలాంటి పరిస్థితిలోనైనా మానకూడదు, వదలకూడదు' అన్నాడు. 'ఈ సత్యము అనేటువంటి riverలో మనము పడదాము. దాటితిమా గట్టు చేరుతాము, అలసిపోతిమా మునిగిపోతాము. అంతేకానీ దీనికింక రెండో మార్గము పూనకూడదు', అన్నాడు. ఈ ప్రపంచములో మనము పడ్డాము. దీని సత్యాన్ని సాధించటానికి మనము ప్రయత్నము చేసితిమా గట్టు చేరతాము. ఈ

సత్యమునకు జడిసి మనము అలసిపోతిమా మునిగిపోతాము. కనుక, మనము యీ దాంట్లో యేమాత్రముకూడను అలసట అనేటువంటిదానికి చోటివ్వకుండా ధైర్యసాహసములతో దీనిని సాధించటానికి ప్రయత్నించాలి. ఏనూటికొక్కడో అయిననూ యిందులో బయలుదేరితేకూడ చాలు.

**ఈశ్వర పితృత్వము, మానవ సోదరత్వములను సాధించటానికి ప్రయత్నించాలి**

ఒకరితో ఒకరు యేమాత్రము వ్యత్యాసభావము పెట్టుకోకూడదు. ఏదో వ్యక్తిగతమైనటువంటి అభిప్రాయ భేదములు వుండినప్పటికినీ మీరందరుకూడను ఒకే భగవంతుని బిడ్డలుగా భావించుకోవాలి. రూపనామములలో భేదము వుండవచ్చు. శారీరకమైనటువంటి శక్తి మరియు భక్తి ప్రపత్తులలో వ్యత్యాసము వుండవచ్చును. మీ భావములలో వ్యత్యాసము వుండవచ్చు. కానీ అందరికి జన్మము ఒక్కటే! ఇందులో యే వ్యత్యాసము లేదు. ఆ యొక్క జన్మతత్త్వాన్ని మనము హృదయములో సమత్వముగా భావించుకున్నప్పుడు అందరుకూడను brothers గా తయారౌతారు. మీరందరు brotherhood of man and fatherhood of God అనే దీనిని సాధించటానికి ప్రయత్నించాలి.

**అందరికి సహాయము చెయ్యండి; ఎవరిని బాధపెట్టకండి**

ఈ ప్రపంచములో మనము చేరినందుకు, ఆ exhibition లో చేరినవాళ్లు ఒక్కొక్కరు ఒక్కొక్క వస్తువును తీసుకొనిపోయినట్లుగా మనము యేదో అనిత్యము, అశాశ్వతము అయినవి మనవెంట తీసుకొనిపోరాదు. ఆ exhibitionయొక్క యజమానినే మనము పొందటానికి ప్రయత్నించాలి. ఆ master ను మనము పొందితిమా యివంతాకూడను మన హస్తగతమైపోతాయి. కనుక master the mind అనేటువంటిది మనము నేర్చుకోవాలి. Be a master mind. యీ రెండిటినీ మీరు సాధిస్తే యింతకంటే మీరింక గొప్పవిద్యను ఆర్జించవలసిన అవసరంలేదు. దీనికంటే గొప్ప విద్యలులేవు. Help ever, hurt never, ఈ రెండింటినీ మాత్రము మీరు లక్ష్యములో పెట్టుకోండి. అందరికి సహాయము చేయండి. ఎవరినీ బాధపెట్టకండి. మీ యొక్క యింద్రియములను కంట్రోలు చేయండి. అప్పుడు

sri sathyasai vachanamrutam

సహనముకూడను మీ స్వాధీనమైపోతుంది. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నారు. Practice makes a man perfect అన్నారు. మనము ఆ practiceలో పోయి perfectగా నిల్చాలి. ఆ పెర్ఫెక్ట్, మర్ఫెట్‌గా మారుతుంది. మర్ఫెట్ Man of Miracles రాసి యెంతమందికి యెన్ని విధాలుగా perfect అయ్యాడో చూడండి. ఆ విధముగా perfect mindతో మనము వుండాలి. కనుక మీరు పవిత్రమైనటువంటి perfectను సంపాదించాలి. మీరు యీయొక్క ఆటలను యేమాత్రము అలక్ష్యము చేయకండి. ఈ వయస్సునకు అది చాలా అవసరం. శరీరానికి ఆరోగ్యమునిస్తుంది. మనసుకు బలము యిస్తుంది. నిజమైన జీవితానికి తేజస్సును, ప్రకాశాన్ని చేకూరుస్తుంది. ఇలాంటి దివ్యమైనటువంటి జీవితములో ఆదర్శవంతమైన దానిని మనము అందించవచ్చును. ఏదో ఒక పని చెయ్యాలి, చెయ్యాలి. అంతేకాని, చేతకాదని నిల్చోకూడదు.

**(తేదీ 17-1-1987న హైయర్ సెంకడరీ స్కూలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam